సాక్షి హనుమకొండ

బుధవారం | 12 | జూలై | 2023



తెలంగాణ అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు కీలకం

రాష్ట్ర అభివృద్ధిలో ఎన్ఆర్ఐలు కీలకమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు.

- 8లో▸



నవాబ్ అలీ సేవలు చిరస్మరణీయం

ఇంజనీర్ నవాబ్ అలీ సేవలు చిరస్మరణీయమని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు అన్నారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33°/25°

వాతావరణం

జిల్లాలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉండి, పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి



విద్యారణ్యపురి : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ పాఠశాలలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సతీష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల చరణ్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి వెంకటరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహరావు, ఏడీఎస్ఓ జిల్లా ఇన్‌చార్జ్ ఎ. సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణలో విఫలమైందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు శివ, ప్రణీత్, పూర్ణచందర్, రాజు, వెంకటేష్, ప్రవీణ్, మంద కార్తీక్, స్టాలిన్, లాస్య, లక్ష్మీ ప్రసన్న, సోఫియా, అమూల్య, అశ్విక, కీర్తన, రోహిత్, చంద్ర వర్ధన్, యాకూబ్, సుమన్, ఇబ్రహీం, సాయి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట : వరంగల్ జిల్లా రంగశాయిపేట శివారు జక్కలొద్ది మైనారిటీ (బాలురు) గురుకులంలో 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న నాన్ మైనారిటీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ఎస్సీ-1, బీసీ-1, 7వ తరగతిలో ఎస్టీ-1, బీసీ-2, 8వ తరగతిలో ఓసీ-2 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన, ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 15లోగా గురుకులంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

పారా సెంటర్ నిర్వహణకు..

వరంగల్ స్పోర్ట్స్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాలతో హనుమకొండ జిల్లాలో ఖేలో ఇండియా పారా సెంటర్ నిర్వహణకు సీనియర్ క్రీడాకారుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్ఓ జి.అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్చరీ, రోలార్ స్కేటింగ్, రోయింగ్, సాఫ్ట్‌బాల్, టెన్నిస్, వాలీబాల్, టెన్‌పిన్ బౌలింగ్, రెజ్లింగ్, ఉషు, యోగాసన క్రీడాంశాల నుంచి ఒక్క క్రీడకు సంబంధించిన ఖేలో ఇండియా పారా సెంటర్‌ను మాత్రమే గుర్తించనున్నట్లు పేర్కొన్నారు. 40 సంవత్సరాల వయస్సు లోపు ఉండి, వ్యక్తిగత క్రీడల్లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉండాలని, సీనియర్ నేషనల్స్, ఖేలో ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన వారు, టీం క్రీడల్లో అంతర్జాతీయ కాంపిటీషన్‌లో పాల్గొని, గుర్తింపు గల ఎన్ఎస్ఎఫ్ అసోసియేషన్ పక్షాన ఆడిన వారు, సీనియర్ నేషనల్స్ ఖేలో ఇండియా గేమ్స్‌లో పతకాలు సాధించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. అర్హత కలిగి, జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారులు ఈనెల 19వ తేదీలోగా హనుమకొండలోని ఇండోర్ స్టేడియంలో ఉన్న డీవైఎస్ఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్ : హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు డీవైఎస్ఓ జి.అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 01, 2014 నుంచి ఆగస్టు 31, 2015 మధ్య జన్మించిన బాలబాలికలకు ఐదో తరగతిలో ప్రవేశాల కోసం ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు ఈ నెల 12, 13 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జిల్లాస్థాయి బ్యాటరీ పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఇందులో ప్రతిభ ఆధారంగా రాష్ట్రస్థాయికి పది మంది బాలురు, పది మంది బాలికలను పంపించనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 27వ తేదీన తుది ఎంపికలు ఉంటాయని వివరించారు. ఎంపికలకు హాజరయ్యే బాలబాలికలు జనన, కుల, స్టడీ ధ్రువీకరణ పత్రాలు, ప్రోగ్రెస్ రిపోర్టు, 10 పాస్‌పోర్టు సైజుఫొటోలు వెంట తీసుకుని రావాలని తెలిపారు.


సర్టిఫికెట్లు తీసుకెళ్లాలి

కాళోజీ సెంటర్: జిల్లాలో వృత్తి విద్యా కోర్సు (డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్)-2023 కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 13 నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్స్ అందించనున్నట్లు డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థుల వారి హాల్‌టికెట్ జిరాక్స్ కాపీ సమర్పించి సర్టిఫికెట్స్ తీసుకోవాలని సూచించారు.

కడియం శ్రీహరికి గ్రీన్‌సిగ్నల్..?!

స్టేషన్‌ఘన్‌పూర్‌లో దూకుడు పెంచిన ఎమ్మెల్సీ

- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు సంకేతాలు
- మూడురోజులుగా శ్రీహరిపై ఘాటైన పదాలతో విమర్శనాస్త్రాలు
- ప్రగతిభవన్ నుంచి రాజయ్యకు పిలుపు
- తాజా పరిణామాలతో వేడెక్కిన రాజకీయం



సాక్షిప్రతినిధి, వరంగల్ :

మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి బరిలో నిలువనున్నారా? బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం ఆయనకు అభయం ఇచ్చిందా? ఆ విషయం లీకై నందుకే ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య నేరుగా శ్రీహరిపై తీవ్ర పదజాలంతో ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నారా? అంటే నిజమే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ శ్రీహరి మొదటి నుంచి రాజకీయ ప్రత్యర్థులే. ఒకరు టీడీపీలో.. మరొకరు కాంగ్రెస్‌లో.. ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉన్నా.. వారిద్దరి మధ్యన ఎప్పుడు వైరమే. అధిష్టానం చొరవతో కలిసి పని చేసినట్లు కనిపించినా..ఎవరికి వారుగా ఆధిపత్యం కోసం పావులు కదుపుతున్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలు రెండు గ్రూపులకు ఆజ్యం పోయగా.. ఇప్పుడవి చినికి చినికి గాలివానగా మారాయి. ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలు పార్టీని అభాసుపాలు చేస్తున్నాయి.

శ్రీహరి దూకుడు వెనుక మర్మం ఏమిటి.. రూ.10 లక్షల వెనుక నిజమెంత?

ఎమ్మెల్సీగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని ఎంచుకున్న కడియం శ్రీహరి ఇటీవల మరింత దూకుడు పెంచడం వెనుక మర్మం ఏమిటన్న చర్చ జరుగుతోంది. కొంతకాలంగా సిట్టింగ్ ఎమ్మెల్యే వివాదాలు ఎదుర్కొంటున్న సమయంలో అధిష్టానం శ్రీహరి వైపు మొగ్గు చూపుతోందన్న ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో సభలు, సమావేశాలను ముమ్మరం చేసిన ఆయన ఫ్లెక్సీలు, హంగు ఆర్భాటాల కోసం మండలానికి రూ.10 లక్షలు పంపిణీ చేశారన్న ప్రచారం ఉంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఇటీవల ఆరోపించారు కూడా. శ్రీహరి మండలానికి రూ.10 లక్షలు పంపిణీ చేశారన్న ప్రచారంలో వాస్తవం ఎంత? అనేది తేలాల్సి ఉంది.

సీఎం పేషీకి 'స్టేషన్' వివాదం ప్రగతిభవన్‌కు రాజయ్య..

ఇద్దరు మాజీ ఉప ముఖ్యమంత్రుల పోరు సీఎం కేసీఆర్ పేషీకి చేరింది. ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యకు ప్రగతిభవన్ నుంచి మంగళవారం పిలుపు వచ్చింది. ఉదయమే ఖరారు చేసిన కార్యక్రమాలను రద్దు చేసుకుని వెళ్లిన ఆయన కేటీఆర్‌ను కలిశా రు. సుమారు గంట తర్వాత బయటకు వచ్చిన ఎమ్మెల్యే రాజయ్య మీడియాతో మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్‌లో సమస్య సద్దుమణిగిందన్నారు. అన్ని విషయాలు వివరించగా పార్టీ లైన్‌లో పనిచేయమని కేటీఆర్ ఆదేశించారన్నారు. 2018 ఎన్నికల్లో కూడా కడియం శ్రీహరి ఇలాగే వ్యవహరించారని, తాను కేసీఆర్ గీసిన లక్ష్మణ రేఖను దాటనని రాజయ్య పేర్కొన్నారు. తాను రాజకీయ నాయకుడిని కాదు, ప్రజానాయకుడనన్న రాజయ్య కొన్ని పరిణామాల దృష్ట్యా కడియం శ్రీహరిపై ఎదురు దాడి చేశానన్నారు. కడియం శ్రీహరిపై చేసినవి అభియోగాలు మాత్రమేనని, తాను కొత్త అభియోగాలు చేయలేదు, పాత వాటినే.. ఉటంకించాననీ సమర్థించుకోవడం చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ

బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరూరి రమేష్



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రమేష్

ఐనవోలు : కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీ అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, రైతులతో కలిసి అరూరి రమేష్.. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుకు ఉచిత విద్యుత్ రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ కుట్రపన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను రైతులందరూ ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. మొన్న ధరణి వద్దన్నాడు, నేడు ఉచిత విద్యుత్ వద్దంటున్నాడు.. రేపు రైతుబంధు, రైతుబీమా కూడా అవసరం లేదంటాడని మండిపడ్డారు. రైతులకు వెంటనే రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో రైతులే ఆయనకు కరెంట్ షాక్ ఇస్తారన్నారు. రేవంత్ వ్యాఖ్యలకు నిరసనగా బుధ, గురు వారాల్లో మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. నిరసన తెలిపేందుకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. దిష్టిబొమ్మ దహన కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, రైతులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు

సాక్షి ఎఫెక్ట్

వరంగల్ అర్బన్ : మురికివాడల్లో దోమల నివారణకు బల్దియా అర్బన్ మలేరియా, ప్రజారోగ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. మంగళవారం 'సాక్షి దినపత్రిక'లో 'వామ్మో..దోమ!' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా స్పందించారు. పారిశుద్ధ్యం, దోమల నివారణ చర్యలపై అధికారులు, సిబ్బందికి సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలోని 39వ డివిజన్ సాకారాశికుంట, ఏకశిలానగర్, హరిజన వాడ, 33వ డివిజన్‌లోని ఆకారపు వీరలక్ష్మి కాలనీ, మునలమ్మ కుంట, నానామియా తోట, 40వ డివిజన్‌లోని దొడ్డి కొమురయ్య కాలనీ, ఉర్సు, కరీమాబాద్, 28వ డివిజన్‌లోని ఎన్టీఆర్‌నగర్, బృందావన కాలనీ, సంతోషిమాత కాలనీ, 46వ డివిజన్‌లో దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. ఖాళీ స్థలాల్లోని మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేశారు. పలు డివిజన్లలో విస్తృతంగా ఫాగింగ్ చేశారు. బయాలజిస్టు మాధవరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, హెల్త్ అసిస్టెంట్లు, కార్పొరేటర్లు మరుపల్లి రవి, పల్లం అరుణ, ముష్కమల్ల అరుణ పాల్గొన్నారు.



32వ డివిజన్ వీరలక్ష్మి కాలనీలో ఆయిల్ బాల్స్ వేస్తున్న కార్పొరేటర్లు, సిబ్బంది

పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలి



ఎంజీఎం : ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుస్సు-5లో భాగంగా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ సాంబశివరావు సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్యాధికారులు, సూపర్‌వైజర్లకు మిషన్ ఇంద్రధనుస్సు-5పై ప్రపంచ ఆరోగ్య సంస్థ, వైద్యారోగ్య శాఖ సంయుక్తంగా మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ సాంబశివరావు మాట్లాడుతూ ముఖ్యంగా స్లమ్ ఏరియాలు, ఇటుక బట్టీల ప్రదేశాలు, సంచార జాతులు ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో టీకాలు వేయించుకోవడం లేదన్నారు. ఈ నెల 14 నుంచి 20 వరకు ఆరోగ్య సిబ్బంది తమ పరిధిలోని సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు, అక్టోబర్ 9 నుంచి 14 తేదీల్లో ప్రత్యేక సెషన్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డబ్ల్యూహెచ్ఓ సర్వే లైన్స్ అధికారి డాక్టర్ ప్రశాంత్ సర్వే విధానం, ఇమ్యునైజేషన్ సెషన్, షెడ్యూల్, సాంకేతిక అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐఓ గీతాలక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్ఓ మదన్‌మోహన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

20న డీవార్మింగ్ డే..

నులిపురుగుల నిర్మూలన కోసం జిల్లాలో ఈ నెల 20న డీ వార్మింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్ఓ సాంబశివరావు తెలిపారు. క్రమం తప్పకుండా డీవార్మింగ్ చేయడం వలన మట్టి ద్వారా పిల్లల్లో సంక్రమించే వ్యాధులు 16 నుంచి 2.5 శాతానికి తగ్గాయని పేర్కొన్నారు. 19 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని కోరారు.

పనులు పెండింగ్ లేకుండా చూడాలి

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య
- తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రావీణ్య

కరీమాబాద్: తహసీల్దార్లు తమ పరిధిలోని పనులు సకాలంలో పూర్తి చేసి పెండింగ్ లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పలు రెవెన్యూ అంశాల మీద మంగళవారం జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జీఓ 58, 59కి సంబంధించిన పట్టాల పంపిణీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈక్రమంలోనే 2023 సంవత్సరంలో వచ్చిన దరఖాస్తుల గురించి వారం రోజులలోపు విచారణ జరపాలని సూచించారు. సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పట్టాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను గుర్తించాలని చెప్పారు. లే అవుట్ మ్యాప్స్ తయారు చేసిన తర్వాత కమిటీ అప్రూవల్ తీసుకుని ప్లాటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా కొత్తవారు దరఖాస్తు చేసుకునేందుకు నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించారు. పీఓటీ కేసులకు సంబంధించి జీఓ, నిబంధనల ప్రకారం దరఖాస్తులను పరిశీలించి ధరణిలో ప్రాసెస్ చేసేందుకు సిద్ధం చేయాలని చెప్పారు. ధరణి మడ్యూల్స్‌లో ఉన్న పెండింగ్‌లను త్వరగా పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ల వద్ద ఉన్న ధరణి దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని, సర్టిఫికెట్లను నిర్దేశిత సమయంలో జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవత్స, ఆర్డీఓ మహేందర్‌జీ అధికారులు పాల్గొన్నారు.

గర్భనిరోధక పద్ధతులను వివరించాలి

హనుమకొండ డీఎంహెచ్ఓ సాంబశివరావు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు

హన్మకొండ చౌరస్తా : పెరుగుతున్న జనాభాను అరికట్టేందుకు వ్యాసెక్టమీ, ట్యూబెక్టమీ ఆపరేషన్లు మాత్రమే కాకుండా తాత్కాలిక గర్భనిరోధక పద్ధతులను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాల్సిన బాధ్యత ఆరోగ్య కార్యకర్తలపై ఉందని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి నుంచి పబ్లిక్‌గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ దంపతులు మొదటి కాన్పు వాయిదా వేసుకోవడానికి, వైవాహిక జీవితాన్ని సుఖ సంతోషాలతో గడిపేందుకు తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన నిరోధ్, నోటి మాత్రలు, అంతర ఇంజెక్షన్, ఐయూడీ వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఒకే బిడ్డతో శాశ్వత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న వారికి, ఐయూడీ చేయించుకున్న ముగ్గురు దంపతులను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి 1000 రూపాయల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతిని అందిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, జీఎంహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ సారంగం, అధికారులు వాణిశ్రీ, హిమబిందు, నిరంజనీదేవి, లక్ష్మీనారాయణ, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెతో ఇబ్బందులు

పాఠశాలల్లో ఉపాధ్యాయులే వంట మనుషులు!

- బోధనపై సరిగా దృష్టిసారించలేని పరిస్థితి
- హనుమకొండ జిల్లాలో రెండోరోజు 35,300 మంది విద్యార్థులకు భోజనం
- సమస్యల పరిష్కారానికి ముందుకురాని ప్రభుత్వం



హనుమకొండ మర్కజీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయినులు

విద్యారణ్యపురి : సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె ప్రభావం విద్యాబోధనపై పడుతోంది. రెండోరోజు మంగళవారం కూడా సమ్మె కొనసాగింది. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులే మధ్యాహ్న భోజనం వండి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. ఎక్కువ సమయం వంట చేసేందుకే కేటాయించాల్సి వస్తోంది. దీంతో బోధనపై వారు సరిగా దృష్టిసారించలేని పరిస్థితి ఏర్పడింది. హనుమకొండ జిల్లాలో 492 ప్రభుత్వ, జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. మధ్యాహ్న భోజనం తినే విద్యార్థులు 37, 526 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులు సోమవారం నుంచి సమ్మెబాటపట్టారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకురావడం లేదు. తక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో వంటచేసి పెట్టడం కొంత సులువే అయినా.. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో ఇబ్బందులు పడుతున్నారు. హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో టీచర్లే వంట చేసి పెట్టారు. అలాగే, సుబేదారిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో కూడా టీచర్లతోపాటు పలువురు బీఈడీ విద్యార్థినులు కలిసి వంటచేసి విద్యార్థులకు వడ్డించారు. ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు మధ్యాహ్న భోజన కార్మికులు రాగా మరోఇద్దరిని బయటనుంచి తీసుకొచ్చి వంటచేయించి పెట్టారు. ప్రాక్టీసింగ్‌హైస్కూల్ మధ్యాహ్న భోజన కార్మికులే వంట చేసి పెట్టారని సమాచారం. కాగా, ఎక్కువ పాఠశాలల్లో ఉపాధ్యాయులే వంట చేస్తున్నట్లు తెలుస్తోంది.



హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంటచేస్తున్న ఉపాధ్యాయులు

సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె ఈనెల 12న ముగియనున్నది. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగిస్తామని ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన కార్మికులు స్పష్టం చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులు మాత్రం ఏం పట్టించుకోకుండా వంట చేస్తున్నట్లు సమాచారం. విద్యాశాఖాధికారులు మాత్రం ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించాలని చెబుతున్నా అది అంత సులువు కాదని ఉపాధ్యాయులు అంటున్నారు. రెండో రోజు మంగళవారం హనుమకొండ జిల్లాలో 35,300 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టారని, మూడు పాఠశాలల్లో మాత్రం వంట చేయకపోవడంతో విద్యార్థులకు భోజనం పెట్టలేదని డీఈఓ కార్యాలయానికి సమాచారం అందినట్లు తెలిసింది.

పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు



కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

రామన్నపేట : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించడంతోపాటు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు రెండు వేల రూపాయల వేతనం పెంచుతామని సీఎం ప్రకటించి అమలు చేయలేదని తెలిపారు. ప్రస్తుతం అందిస్తున్న వెయ్యి రూపాయలు సైతం ఐదు నెలల నుంచి చెల్లించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాసు మాధవి, రజిని, అనసూర్య, చింత, ఎల్లమ్మ, మల్లికాంబ, పాలెపాక లక్ష్మి, ఉమా కుమారి, రాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచాలి

విద్యారణ్యపురి : మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలని ఏఐటీయూసీ అనుబంధ మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ బాధ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ ఎంఎస్ నంబర్ 8 ప్రకారం ఎరియర్స్‌తో సహా కార్మికులకు వేతనాలు చెల్లించాలని, మధ్యాహ్నం భోజనం పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గ్యాస్ సబ్సిడీ అందజేయాలని, కోడిగుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, బకాయి బిల్లులను తక్షణమే చెల్లించాలని కోరారు. 100 మంది విద్యార్థులున్న పాఠశాలల్లో 25:1 పనిచేసే పద్ధతిన నియమించాలని పేర్కొన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి, బాధ్యులు జక్కుల రాజుగౌడ్, నిమ్మల రామ్మూర్తి, గుంటి రాజేందర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దం లలిత, బాధ్యులు విజయ, అనిత, కవిత, మంజుల, శాంత, నైనాల విజయ, ఎండీ.మస్తాన్, అజ్మితాబేగం, లక్ష్మి, కల్పన, ఇందిర, లక్ష్మి పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కమిషనరేట్ పరిధిలో పోలీస్ అధికారుల బదిలీలు

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌స్పెక్టర్లు..

వెంకటరత్నం వీఆర్ నుంచి పరకాల, పి.కిషన్ పరకాల నుంచి వీఆర్, కె.రామకృష్ణ కాజీపేట ట్రాఫిక్ నుంచి గీసుగొండకు ఎస్.రాజు గీసుగొండ నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు.

సబ్ ఇన్‌స్పెక్టర్లు..

డి.విజయ్‌కుమార్ హసన్‌పర్తి నుంచి రాయపర్తి, డి.రాజు వీఆర్ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎల్.కొంరెల్లి కొడకండ్ల నుంచి ఇంతేజార్‌గంజ్, వి.నవీన్‌కుమార్ దుగ్గొండి నుంచి ఐనవోలు , జి.వెంకన్న ఐనవోలు నుంచి ఇంతేజార్‌గంజ్, ఈ.వీరభద్రరావు శాయంపేట నుంచి పర్వతగిరి, డి.దేవేందర్ పర్వతగిరి నుంచి కమాలాపూర్, ఈ.నర్సింహారావు మడికొండ నుంచి టాస్క్‌ఫోర్స్, ఆర్.రణధీర్ కాజీపేట ట్రాఫిక్ నుంచి వరంగల్ ట్రాఫిక్, ఆర్.రామారావు వరంగల్ ట్రాఫిక్ నుంచి కాజీపేట, జే.నాగరాజు ఇంతేజార్‌గంజ్‌నుంచి స్టేషన్ ఘన్‌పూర్, వంశీకృష్ణ వీఆర్ నుంచి టాస్క్‌ఫోర్స్, కె.కిషోర్ వీఆర్ నుంచి హసన్‌పర్తి, వి.చరణ్‌కుమార్ కుమాలాపూర్ నుంచి వీఆర్, ఎండీ రవుఫ్ వీఆర్ నుంచి ఎస్సై -2 పాలకుర్తికి బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్‌ఎఫ్‌ఓకు శౌర్య పతకం



గ్రేటర్ వరంగల్ ఆర్‌ఎఫ్‌ఓ పాపయ్య

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ రీజినల్ ఫైర్ ఆఫీసర్(ఆర్‌ఎఫ్‌వో) వి.పాపయ్యకు రాష్ట్ర ప్రభుత్వం శౌర్య పతకం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెల్లడించింది. సికింద్రాబాద్‌లోని డెక్కన్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో అసమాన ధైర్యం చూపి పలువురి ప్రాణాలను కాపాడిన నేపథ్యంలో పాపయ్యకు ప్రభుత్వం ప్రతిష్టాత్మక శౌర్య పతాక అవార్డును ప్రదానం చేయనుంది.

లీడింగ్ ఫైర్‌మెన్ రవీందర్‌కు..



రవీందర్

వరంగల్ : వరంగల్ అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.రవీందర్‌కు తెలంగాణ అగ్నిమాపక శాఖ ఉత్తమ సేవా పతకం ప్రకటించింది. 1987లో ఉద్యోగంలో చేరిన రవీందర్ 2017 సేవా పతకం అందుకున్నారు. ఇప్పటి వరకు 36 ఏళ్లుగా శాఖలో సేవలు అందించినందుకు ప్రభుత్వం ఉత్తమ సేవా పతకం ప్రకటించిందని డీఎఫ్‌ఓ భగవాన్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్తమ సేవా పతకం అందుకున్న రవీందర్‌ను అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

తెలంగాణ అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు కీలకం

- అమెరికా, ఇండియా వారధులు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



అమెరికాలో సాయిదత్త ఆలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి /దేవరుప్పుల : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు కీలకమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం ఫిలడెల్ఫియాలో 'తానా' సభలకు వెళ్లిన మంత్రి ఎర్రబెల్లి.. సాయి దత్త ఆలయాన్ని సందర్శించగా అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐ 'మీట్ అండ్ గ్రీట్' లో మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం వచ్చి స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు జన్మభూమిపై మమకారం చూపడం వల్లే దేశం, రాష్ట్రం పలు రంగాల్లో పురోగతి సాధిస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని, మరింత అభివృద్ధి సాధించడానికి అమెరికా, ఇండియా వారధులుగా ఎన్‌ఆర్‌ఐలు తోడ్పాటు అందించాల్సి ఉందన్నారు.

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై ఎర్రబెల్లి ఆగ్రహం

సీఎం కేసీఆర్.. రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్ ఇస్తుంటే.. 3 గంటల విద్యుత్ చాలని అమెరికాలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు చేపడుతుంటే హర్షించేదిపోయి ఎల్లలు దాటినా రాజకీయ ఉనికి కోసం అర్థరహిత విమర్శలు తగవన్నారు. రైతు పక్షపాతి పాలన కొనసాగిస్తున్న ఘనత దేశంలో సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

లైబ్రరీకి ఆటోమేషన్ అవసరం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పింగిళి కళాశాల ప్రిన్సిపాల్,తదితరులు

- కేయూ వీసీ ఆచార్య రమేశ్

కేయూ క్యాంపస్: ప్రతి కళాశాలకు లైబ్రరీ ఆటోమేషన్ అవసరమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాల లైబ్రరీ విభాగం, ఐక్యూఏసీ సంయుక్తంగా ఈఏడాది ఆగస్టు 4, 5 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్లను సోమవారం క్యాంపస్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీ ఆటోమేషన్‌పై నిర్వహించే ఈవర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ పరిధిలోని అన్ని లైబ్రరీల్లో ఆటోమేషన్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ ఈవర్క్‌షాప్‌లో లైబ్రరీ ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, కేయూ పాలక మండలి సభ్యులు నాగేంద్రబాబు, మల్లారెడ్డి, ప్రొఫెసర్ మనోహర్, రిటైర్డ్ ఆచార్యులు సుమతిఉమా మహేశ్వరి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత రచనారాజిరెడ్డి, పింగిళి కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని,లైబ్రేరియన్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వాహనాల తొలగింపు..

సాక్షి ఎఫెక్ట్..



వాహనాలను తొలగించడంతో విశాలంగా ఉన్న రహదారి

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో టమాట బాక్స్‌లను తీసుకొచ్చిన డీసీఎంలు రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలపడంతో వ్యాపారులు, వినియోగదారులు పడుతున్న ఇబ్బందులపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'దారి చూపరూ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మార్కెట్ అధికారులు స్పందించారు. మంగళవారం మార్కెటింగ్‌శాఖ అధికారులు డీఎంవో ప్రసాదరావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి బీవీ రాహుల్, గ్రేడ్-2 కార్యదర్శి రాములు సందర్శించి అడ్డుగా ఉన్న డీసీఎంలను తొలగించారు. ఈ సందర్భంగా డీఎంవో ప్రసాదరావు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌లో వినియోగదారులు రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. టవర్ వద్ద నిలుపుతున్న వాహనాలతో పాటు రోడ్డుకు ఇరుపక్కల ఉన్న చిల్లర వ్యాపారులను సైతం క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. రెండు రోజుల్లో చిల్లర వ్యాపారులు క్రమపద్ధతిలో విక్రయాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్.. రెండు గంటలు ఆలస్యం

- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



కాజీపేట చేరుకున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు మంగళవారం రాత్రి సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటల ఆలస్యంతో చేరుకుంది. ఖమ్మం-విజయవాడ సెక్షన్‌లో రైల్వే ట్రాక్ మరమ్మతులు, మూడో లైన్ నిర్మాణం కారణంగా గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఉదయం గంట ఆలస్యంతో వెళ్లినట్లు రైల్వే అధికారులు తెలిపారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌యే తిరిగి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌గా వెళ్తుందని తెలిపారు. దీంతో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం నిర్ణీత సమయం కన్నా సుమారు రెండు గంటల ఆసల్యంతో కాజీపేట జంక్షన్‌కు చేరుకుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నవాబ్ అలీ సేవలు చిరస్మరణీయం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ : ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ సేవలు చిరస్మరణీయమని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు అన్నారు. నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ 146వ జయంతిని మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ గోపాల్‌రావు.. నవాబ్ అలీ నవాజ్ జంగ్ చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నవాబ్‌అలీ నవాజ్ జంగ్ బహదూర్ పుట్టిన రోజును తెలంగాణ ఇంజనీర్స్‌డే గా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న కాలంలో ఆయన అనేక భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటిని విజయవంతంగా నిర్మించారన్నారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చే హిమయత్ సాగర్, ఓయూ ఆర్ట్స్ కాలేజీ, ఉస్మానియా హాస్పిటల్, జూబ్లీహాల్, ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ తదితర ఎన్నో చరిత్రాత్మక నిర్మాణాలను చేపట్టారని గుర్తుచేశారు. గోదావరి, మంజీరా నదులపై వంతెనల నిర్మాణాల్లో కీలక పాత్ర పోషించారని, అలాగే టెలిఫోన్ సౌకర్యం జిల్లాలకు విస్తరించేందుకు ఆయన చూపించిన చొరవ ఎనలేనిదన్నారు. నవాబ్‌అలీ జంగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని వినియోగదారులకు సంస్థలోని ప్రతి ఉద్యోగి నాణ్యమైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు టి.సదర్‌లాల్, అశోక్‌కుమార్, టి.మధుసూదన్, మోహన్‌రావు, కిషన్, సి.ప్రభాకర్, రవీంద్రనాథ్, రాజు చౌహాన్, కెఎస్ గుట్ట, బికంసింగ్, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, జీఎంలు శ్రవణ్‌కుమార్, నాగప్రసాద్, గిరిధర్, వేణుబాబు, శ్రీకృష్ణ, సత్యనారాయణ, మనోహర స్వామి, దేవేందర్, వేణుబాబు, అన్నపూర్ణ, సత్యనారాయణ, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

- వరంగల్ మార్కెట్ కమిటీ ఎస్‌జీఎస్ బీవీ రాహుల్



పోస్టర్లతో నిరసన తెలుపుతున్న మార్కెట్ ఉద్యోగులు

వరంగల్ : మార్కెట్ ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాలని వరంగల్ మార్కెట్ కమిటీ ఎస్‌జీఎస్ బీవీ రాహుల్ అన్నారు. ఈమేరకు మంగళవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం ఎదుట ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఉద్యోగులందరికీ ఓపీఎస్ అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశాయన్నారు. అదే విధంగా తెలంగాణలో కూడా ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టీఎన్‌జీఓస్(మార్కెటింగ్) జిల్లా అధ్యక్షుడు జన్ను భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్, కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు ఈ నిరసన చేపట్టామన్నారు. కార్యక్రమంలో కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు పి.అశోక్, వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు ఎండీ బియబానీ, రాము, కృష్ణమీనన్‌రావు, శ్రీనివాస్‌రాజ్, నర్సింహానాయక్, కుమార్, కన్నయ్య, రమణ, స్వప్న, రాజేశ్వరి, పద్మ, లత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నమోదు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వాసంతి

కాశోజీ సెంటర్: పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని డీఈఓ వాసంతి అధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని డీఈఓ కార్యాలయంలో జిల్లాలోని ఎంఈఓలు, నోడల్ ఆఫీసర్లతో డీఈఓ వాసంతి పాఠశాలలో అమలవుతున్న వివిధ కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ వాసంతి మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని, విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ అప్‌డేట్ చేయాలని తెలిపారు. ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పేరెంట్స్, టీచర్స్ నిర్వహించి విద్యార్థులు సాధించిన పురోగతిపై చర్చించాలన్నారు. బయో మెట్రిక్ అటెండెంట్స్ పై శ్రద్ధ పెట్టాలని, మిషన్ సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. మన ఊరు - మన బడి పనుల పురోగతిని పరిశీలించి, పరిష్కరించాలన్నారు. డ్యామెజ్ రైస్ డాటాను పంపించాలని ఆదేశించారు. స్కూల్ కాంప్లెక్స్ క్రమం తప్పకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ

ఖిలా వరంగల్ మండలంలోని మామునూర్ ఎంపీపీఎస్‌ను మంగళవారం డీఈఓ వాసంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల ఆఫీసు సబార్డినేట్ పాఠశాల విధులకు సమయపాలన పాటించడం లేదనే విషయాన్ని గమనించారు. విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉండటం, టైమ్ టేబుల్ తయారు చేయకపోవటం, పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం, ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రోగ్రాం నిర్వహించకపోవడంలో సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు ఆలస్యంగా హాజరైన ఉపాధ్యాయుడు, ఆఫీస్ సబార్డినేట్‌కు ఒక రోజు సెలవు వేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలకు ప్రార్థన సమయం కంటే ముందు హాజరుకావాలని ఆదేశించారు.

13న జాబ్ మేళా

కాశోజీ సెంటర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 13న నగరంలోని ములుగు రోడ్డు, ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని భారత్ ఫైనాన్సియల్ ఇన్‌క్లూషన్ లిమిటెడ్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసేందుకు సుమారు 100 ఉద్యోగాలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ చదివి 18 నుంచి 28 లోపు ఉన్న యువత ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు వారి విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఈనెల 13న జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 77993 14685 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

13న పోస్టర్ మేకింగ్ పోటీలు

కాశోజీ సెంటర్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈనెల 13న నగరంలోని శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ వాసంతి తెలిపారు. సేఫ్ యూజ్ ఆఫ్ ఇంటర్నెట్ గ్యాడ్జెట్స్, ప్రొటెక్షన్ ఆఫ్ ఇన్విరాన్‌మెంట్(రీ యూజ్- రీఫ్యూజ్ - రీసైకిల్) అనే అంశాలపై పోటీలు ఉంటాయని ఒక ప్రకటలో పేర్కొన్నారు. విద్యార్థి ఏదో ఒక అంశం ఎంపిక చేసుకోవాలని వివరించారు. ఒక పాఠశాల నుంచి ఒక విద్యార్థిని మాత్రమే పంపాలని, విద్యార్థి వెంట గైడ్ టీచర్ తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆడెపు రవీందర్ ఎస్‌ఏ 90593 96611, జిల్లా అకడమిక్ అధికారి సారయ్య 80969 86048 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపికలు

కాశిబుగ్గ: రాష్ట్రంలోని హకీంపేట, మేడ్చల్, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలు వరంగల్ ఓ సిటీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. మంగళవారం చెన్నారావుపేట, నెక్కొండ, నర్సంపేట, దుగ్గొండి మండలాల స్థాయిలో ఎంపికైన 39 మంది బాలబాలికలు ఈ ఎంపికలకు హాజరయ్యారని జిల్లా యువజన క్రీడల అధికారి ఇందిర తెలిపారు. వారి సర్టిఫికెట్లు పరిశీలించి పోటీలు నిర్వహించామని తెలిపారు. ఖానాపురం మండలానికి చెందిన విద్యార్థులు వర్షం కారణంగా గైర్హాజరయ్యారని వారికి బుధవారం పర్వతగిరి, రాయపర్తి,నల్లబెల్లి,వర్ధన్నపేట మండల విద్యార్థులతోపాటు పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. స్పోర్ట్స్ సిబ్బంది మౌనిక, రాజేందర్, అహ్మద్, కోచ్‌లు పాల్గొన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కాశోజీ సెంటర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికుల పెండింగ్ బిల్లుల చెల్లింపు, కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. కార్మికులకు రూ.2వేల వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించి నేటి అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం కార్మికులకు ఇస్తున్న రూ.వెయ్యి గౌరవ వేతనం కూడా ఐదు నెలల నుంచి చెల్లించడం లేదన్నారు. కార్మికుల పట్ల రాజకీయ ఒత్తిళ్లు మానుకొని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే బడ్జెట్ కేటాయించి కార్మికుల పెండింగ్ బిల్లుల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాసు మాధవి, రజిని, సారిక, అనసూర్య, జన్ను మేరీ, ఎల్లమ్మ, సుజాత, మల్లికాంబ, లక్ష్మి, సరోజన, ఉమ, రాజు, ప్రభాకర్, ప్రభాకర్, పాషా, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయురాలు..

- రైలు ఎక్కుతూ జారిపడిన వృద్ధురాలు
- తప్పిన ప్రాణపాయం
- వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘటన



రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో పడిపోయి రైలు కింద ఉన్న తేరోజా

కాశిబుగ్గ: తన బిడ్డ దగ్గరకు వెళ్లడానికి రైలు ఎక్కే క్రమంలో ఓ వృద్ధురాలు జారీ పడి రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో పడింది. ఈ ప్రమాదంలో వృద్ధురాలికి ప్రాణపాయం తప్పిందిగాని, కాలు పాదం నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటన మంగళవారం వరంగల్ రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై జరిగింది. వరంగల్ జిల్లా మామునూరుకు చెందిన సింగారపు తేరోజా(60) తన వియ్యపురాలు జన్ను కమలతో కలిసి సికింద్రాబాద్‌లో ఉంటున్న తన బిడ్డ వద్దకు వెళ్లాడనాఇకి వరంగల్ రైల్వే స్టేషన్ చేరుకుంది. ఉదయం 11.56 గంటలకు గొల్కొండ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్ రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫామ్‌కు చేరుకుంది. ఈ క్రమంలో రైలు నుంచి ప్రయాణికులు దిగుతుండగానే కమల బ్యాగుతో రైలు ఎక్కింది. తేరోజా రెండు బ్యాగులు రైలులో పెట్టి ఎక్కుతుండగా కదిలింది. దీంతో జారిపడిన తేరోజా రైలు, ప్లాట్‌ఫామ్ మధ్యలో పడింది. దీనిని చూసిన ప్రయాణికులు కేకలు వేయడంతో రైలులో ఉన్న వారు చైన్ లాగారు. దీంతో పైలట్ వెంటనే రైలు ఆపారు. అప్పటికే తేరోజా కుడి కాలు పాదం రైలు కింద పడి నుజ్జు నుజ్జు అయింది. వెంటనే ప్రయాణికులు, ఆర్పీఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెను బయటకు తీశారు. అనంతరం 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ప్రత్యక్షంగా చూసిన ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లిన కారు..

- వర్ధన్నపేట ఎస్సైకి తప్పిన పెను ప్రమాదం



ఆకేరు వాగులోకి దూసుకెళ్లిన కారు

వర్ధన్నపేట: వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు పెనుప్రమాదం తప్పింది. విధుల నిమిత్తం మంగళవారం తన సొంత కారులో డ్రైవ్ చేసుకుంటూ వరంగల్‌లోని తన నివాసం నుంచి వర్ధన్నపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఆకేరు వాగు బ్రిడ్జి ప్రారంభంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కుక్క అడ్డు వచ్చింది. దీనిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బెలూన్ ఓపెన్ కావడంతో ఆయన ప్రమాదం నుంచి తృటిలో బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది.

ఆ పాప ఎవరు..? కథనంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



విచారణ చేస్తున్న అధికారులు

కాశోజీ సెంటర్ అమెరికా దంపతులు..వరంగల్‌కు చెందిన ఓ ఆరేళ్ల శిశువును దతత్త తీసుకునే అంశంపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీడబ్ల్యూసీ సభ్యులు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, ఏహెచ్‌టీయూ పోలీస్ , ఐసీడీఎస్ సూపర్‌వైజర్.. వరంగల్ పిన్నవారి వీధిలో ఉంటున్న ఆ కుటుంబం వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. వారి సమాచారం మేరకు వరంగల్ ములుగు రోడ్డులోని 'రియా' ఆస్పత్రిలో పాప బర్త్ వివరాలు, రికార్డులను తనిఖీ చేయగా అందుకు సంబంధించిన వివరాలు లేకపోవడంతో బుధవారం సీడబ్ల్యూసీ ఎదుట హాజరు కావాలని ఆదేశించినట్లు సమాచారం.

మలేరియా, డెంగీపై జాగ్రత్త..!

గీసుకొండ: జిల్లాలో ప్రస్తుత వర్షాకాలంలో డెంగీ, మలేరియా లాంటి కీటక జనిత వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, ముందస్తుగా ప్రభావిత ప్రాంతాలను గుర్తించి సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలని జోనల్ మలేరియా అధికారి సునీల్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. డీఎంహెచ్‌ఓ వెంకటరమణ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 38 డెంగీ, నాలుగు మలేరియా కేసులు నమోదయ్యాయని, దోమల నివారణలో భాగంగా మందులను పిచికారీ చేయించామని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. కీటక జనిత వ్యాధుల పర్యవేక్షణ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ జ్వర సర్వే నిర్వహించి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని చెప్పారు. మలేరియా విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ రాజేశ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

WANTED
మెడికల్ ఆఫీసర్ - 2 MBBS / DCP / MD Pathology పూర్తయి ఉండవలెను
ల్యాబ్ టెక్నీషియన్స్ - 3 DMLT లేదా అపై చదువులో ఉత్తీర్ణులై ఉండవలెను. SDP మిషన్‌పై పని చేసిన అనుభవం కలవారై ఉండవలెను
డ్రైవర్ పోస్ట్ - 1
Application చివరి తేది: 25-07-2023 సా. 5 గం.ల వరకు
పూర్తి వివరములకు సంప్ర: 8367356765, 8367056765
Indian Red Cross Society
HANUMAKONDA District. (Constituted Under Act XV of 1920)

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
మీ బంగారం తాకట్టులో ఉందా వడ్డీ చెల్లించ లేకపోతున్నారా తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 7013501541 [H-788601]

నాటు కోళ్ళు పెంచండి...!
స్వచ్ఛమైన నాటుకోడి పిల్లలు అసీల్, టర్కి, సీమ కోళ్ళు పెంచండి. వివరాలకు సంప్ర।। SV Agro Farm, హంటర్ రోడ్, వరంగల్. సెల్. 9959426718. [W-785666]

WANTED
Wanted DTP Computer Operator (Male / Female) for Sunitha Stamp Vendor, NIT Kazipet Office, Job: 9:30 to 6.30. Cont: Cell: 9346497451. [W-785624]

ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు వ్రాయుటకు స్త్రీ /పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. ఫోన్ 70756 56208. [V-6190]

ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221199]

WANTED TEACHERS
Wanted Teachers to teach Science upto 7th class. Vandhana High School, Shivanagar, WGL. Cell No: 9849943040. [W-785689]

Wanted Teachers to Teach 2nd to 5th Class English, E.V.S & High School English. Contact: Cell: 8801802586, 9397696508. [W-1110348]

VISA Consultation Overseas Blue & White Collar Jobs All Profiles Lucrative Salary Highpay. Interviews Vizag 9th to 11th July&Hyd. 13th&14th July. Ph: 9717618737 [HA-3289]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ।। అదనపు లైను 60/- రూ।। మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com